క్లుప్తంగా

వాహనాల తనిఖీ



ఎడపల్లి(బోధన్): జానకంపేటలో నవీపేట్–జానకంపేట ప్రధాన రహదారిపై ఎడపల్లి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు చూపని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఏఎస్సై ఇలియాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వేల్పూర్: జాన్కంపేట్‌లో ఎడ్ల ప్రభుదాస్‌కు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, నాయకులు జి.గంగారెడ్డి, జేమ్స్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, జయరాజ్, వినోద్, నరేశ్, ప్రభాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దౌర్జన్యాలు అరికట్టాలి



ఆర్మూర్‌టౌన్: దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను తక్షణమే అరికట్టాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోని ఘోరంచలో బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధుడి విగ్రహం ప్రతిష్ఠించినందుకు దళితులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. ఇదే విధంగా కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి దళిత ఎంపీ గుడిసెల వంశీ కృష్ణకు ఆహ్వానం అందకపోవడం సరికాదన్నారు. పుష్కరాల సెక్రటరీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఐత్వార్‌పేట్ లింగన్న, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంతం మురళీధర్, ఆర్మూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పింజ సుదర్శన్, కొంతం పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

'పల్లె దవాఖానాను వెంటనే ప్రారంభించాలి'

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో పూర్తయిన పల్లె దవాఖాన భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పల్లె దవాఖాన భవనం పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కనీసం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మోత్కూరి లింగాగౌడ్ అన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు హనుమాన్ ఆలయంలో ఆదివారం స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి సేవలు మరింత విస్తరించి ఆర్మూర్‌ను స్వచ్ఛ ఆర్మూర్‌గా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి ఆదివారం ఒక గంట పాటు స్వచ్ఛ కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. అనంతరం హనుమాన్ ఆలయం ఆవరణలో గల పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు.

పుచ్చకాయతో జన్మదిన వేడుకలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని శ్రీరామ కాలనీలో ఆర్మూర్ ఏరియా ప్రముఖ చార్టెడ్ అకౌంట్, ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన స్నేహితులు వినూత్న పద్ధతిలో నిర్వహించారు. సాధారణంగా జన్మదిన వేడుక అంటే కేక్ తెచ్చి కోయించేవారు. అలా కాకుండా రైతులు పండించే పుచ్చకాయను కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. స్నేహితులు జీవీ నర్సింహారెడ్డి, రఫీక్, రాజు, అర్గుల్ సురేష్, పుట్టి మురళి, సందీప్, సుదర్శన్, సాయి తదితరులు పాల్గొన్నారు.



పెద్ద బజార్ రోడ్డులో..



సీపీ కార్యాలయం ముందు..



పులాంగ్ నుంచి వర్ని చౌరస్తా వెళ్లే రోడ్డులో..

అంధకారంలో ఇందూరు నగరం

- రాత్రి వేళ వెలగని లైట్లు
- ప్రధాన రహదారులన్నీ చీకటిమయం
- రోడ్డు మీద దుకాణం ముందున్న లైట్లే దిక్కు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



చిమ్మ చీకటిగా హైదరాబాద్ రోడ్డు

నిజామాబాద్ సిటీ: ఇందూరు నగరంలో రాత్రివేళ చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. రాత్రి 10 దాటితే నగరంలో చాలా ప్రదేశాలు అంధకారంగా మారుతున్నాయి. రోడ్లలో వీధి లైట్లు వెలగడం లేదు. ప్రధాన రోడ్లు కూడా చీకటిమయంగా మారుతున్నాయి. షాపుల ముందున్న లైట్ల వెలుగులోనే రోడ్లు కనపడుతున్నాయి. దుకాణాలు మూసివేసిన తర్వాత చీకటిమయంగా మారుతున్నాయి. వీధిలైట్ల నిర్వహణలో బల్దియా అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.రాత్రివేళ ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు విద్యుత్ లైట్లు వెలగాలి. నగరంలోని కాలనీలతోపాటు ప్రధాన వీధుల్లో సైతం లైట్లు వెలుగుతుంటాయి. కానీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాత్రం కొన్ని నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదు.సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 వరకు రోడ్ల పక్కన ఉన్న దుకాణాలు, మాల్స్ బయట ఏర్పాటు చేసిన లైట్ల వెలుగు మాత్రమే ఉంటోంది. దుకాణాలు మూసివేసిన తర్వాత రాత్రి 10 గంటల తర్వాత నగరం మొత్తం అంధకారంగా మారిపోతోంది.

పలు రహదారులలో..

నగరంలోని హైదరాబాద్ రోడ్డు, బోధన్‌రోడ్డు, నెహ్రూపార్కు నుంచి వర్ని చౌరస్తా వరకు, ఎల్ఐసీ చౌరస్తా నుంచి పూలాంగ్ వరకు, పూలాంగ్ నుంచి మాధవనగర్ వరకు, పూలాంగ్ నుంచి వర్ని చౌరస్తా, ఆర్టీఏ కార్యాలయం వరకు గాఢ అంధకారంగా మారుతోంది. రాత్రి 10 గంటలు దాటితే చిమ్మచీకట్లే. ముందున్న వాహనం కూడా కనపడటం లేదు. బస్టాండ్ నుంచి ఖలీల్‌వాడి వచ్చే రోడ్డు, ఆటోస్టాండ్, బస్టాండ్ వెనుకభాగం, రైల్వేస్టేషన్ ఏరియా, కంఠేశ్వర్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు, పోలీసు కమిషనర్ కార్యాలయం ఎదుట కూడా లైట్లు వెలగం లేదు. వీధి దీపాలతోపాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ కూడా పనిచేయడం లేదు.

వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు..

నగరంలో రాత్రివేళ ప్రయాణించే పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ముందున్న వ్యక్తులు కనపడకపోవడం, వాహనాలు దగ్గరికి వచ్చేవరకు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయ. బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ దవాఖానాకు వెళ్లే రోడ్డులో లైట్లు లేకపోవడంతో ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే అదనుగా పిక్ పాకెటర్లు, ఆకతాయిలు, కిలేడీలు ఆగడాలు పెరుగుతున్నాయి.



రాజరాజేంద్ర చౌరస్తా వద్ద..

రాత్రివేళ ఇబ్బందిగా ఉంది



నేను ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తాను. రాత్రి 10 తర్వాత ఇంటికి వస్తుంటే చాలా ఇబ్బందిగా ఉంటోంది. రోడ్డుమీద ఏమీ కనపడటం లేదు. లైట్లు అసలే వెలగడం లేదు. చీకటిలోనే ఇంటికి రావాల్సి వస్తోంది. అధికారులు చొరవ తీసుకుని లైట్లు ఏర్పాట్లు చేయాలి.

– టి.శ్రీధర్, యాదగిరిబాగ్

భయంగా ఉంటోంది



మాకు గంజ్‌మార్కెట్‌లో కూరగాయల దుకాణం ఉంది. రాత్రి 10 తర్వాత ఇంటికి వెళ్తుంటే చిమ్మ చీకటిగా ఉంటుంది. రోడ్డుమీద ఒక్క లైట్ వెలగడం లేదు. రోడ్డు గుండా రావాలంటే భయం వేస్తోంది. పక్కన ఎవరు వస్తున్నారో కూడా కనపడటం లేదు. రోడ్ల మీద లైట్లు వెలగాలి. అధికారులు లైట్లు ఏర్పాటు చేయాలి.

– పద్మావతి, నాగారం

కాంట్రాక్టు గడువు ముగిసింది



గతంలో స్ట్రీట్ లైట్ల నిర్వహణ హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీకి ఇచ్చారు. వారి గడువు ముగిసింది. ఇంకా ఎవరికీ కాంట్రాక్టు ఇవ్వలేదు. దాంతో వీధిలైట్ల నిర్వహణలో సమస్యలు వస్తున్నాయి. ముఖ్యమైన చోట్ల అత్యవసరంగా లైట్లు అమర్చేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా. త్వరలో కొన్ని ముఖ్యమైన చోట్ల లైట్లు అమరుస్తాం.

– దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్

భక్తిశ్రద్ధలతో పోచమ్మ పండుగ



ఘన్‌పూర్‌లో బోనాల ఊరేగింపులో మహిళలు

డిచ్‌పల్లి: ఘన్‌పూర్, డిచ్‌పల్లి ఖిల్లా గ్రామాల్లో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో పోచమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలందరినీ చల్లగా చూడాలని గ్రామదేవతలను వేడుకున్నారు.

సిర్పూర్‌లో బోనాల పండుగ

మోపాల్: సిర్పూర్‌లో ఆదివారం పెద్దమ్మ తల్లికి బోనాలు పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.



సిర్పూర్‌లో బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్సీ కవిత నిధులతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



దేవితండాలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ రమేష్ నాయక్

ఇందల్వాయి: ఎమ్మెల్సీ కవిత మంజూరు చేసిన నిధులతో మండలంలోని దేవితండా, రూప్లనాయక్ తండా, మేఘ్యనాయక్ తండా, చంద్రయాన్‌పల్లి తండా, సిర్నాపల్లి గ్రామాల్లో ఏడు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీపీ రమేష్ నాయక్ తెలిపారు. దేవితండాలో ఏర్పాటు చేసిన లైట్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఒక్కో లైట్ విలువ రూ.1.50 లక్షలని ఆయన తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ కవితకు, అందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ సభ్యత్వం రద్దు

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్త చెలిమెల నవీన్‌ను జిల్లా అధిష్ఠానం పార్టీ సభ్యత్వం రద్దు చేసి, సస్పెండ్ చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్ యాదవ్ మాట్లాడుతూ.. నవీన్ కొన్ని రోజులుగా పార్టీ సిద్ధాంతాలు, నియమాలకు విరుద్ధంగా ఇతర పార్టీల నాయకులతో కలిసి పనిచేస్తూ పార్టీకి నష్టం చేస్తున్నాడని గుర్తించిందని తెలిపారు. అధిష్ఠానం ఆయన ప్రాథమిక సభ్యత్వం రద్దు చేస్తూ, బీజేపీ నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు ప్రకటించిందని చెప్పారు. చెలిమెల నవీన్ సోషల్ మీడియాలో పెట్టే పోస్టులతో గానీ, ఇతరులపై చేసే విమర్శలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు అందరూ పార్టీ సిద్ధాంతాల కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తే ఎవరినైనా ఉపేక్షించలేదని హెచ్చరించారు.

పెళ్లి వేడుక



డీఎస్ సోదరుడు ధర్మపురి ప్రకాష్ కుమారుడి వివాహ వేడుకకు హాజరైన ఎంపీ అర్వింద్, బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్, పైడి రాకేష్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, స్రవంతిరెడ్డి



వధూవరులతో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ అర్వింద్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్



హైదరాబాద్‌లో కామారెడ్డి జిల్లాకు చెందిన ప్రభాకర్‌రెడ్డి కుమారుడి వివాహానికి హాజరై ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ డి. విఠల్‌రావు

భక్తితో చేసే ఏ పనైనా సఫలీకృతమవుతుంది



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రూబెన్‌మార్క్

బోధన్‌టౌన్(బోధన్): దేవుని మీద భక్తితో చేసే ఏ పనైనా సఫలీకృతమవుతుందని ఇన్‌చార్జి మోడరేట్ డాక్టర్ రూబెన్ మార్క్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆచన్‌పల్లిలోగల సీఎస్ఐ చర్చిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవ, శాంతి, భక్తి మార్గంలో నడవాలన్నారు. ఆయనను కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. చర్చి ఫాదర్ ప్రభాకర్, కమిటీ ప్రతినిధులు దమ్మల్ల జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, తదితరులున్నారు.

టీయూసీఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు



పోస్టర్లు విడుదల చేస్తున్న సంఘం ప్రతినిధులు

నిజామాబాద్ సిటీ: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి పోస్టర్లు విడుదలచేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. వచ్చేనెల 21, 22 తేదీల్లో జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ ఆహ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, ప్రొఫెసర్ రిక్క లింబాద్రి, ప్రధాన కార్యదర్శిగా కె.సూర్యం, కోశాధికారిగా ఎం.నరేందర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. పోరాటాల వల్లనే హక్కులు దక్కుతాయని, కార్మిక హక్కుల రక్షణ కోసం బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీలే కాకుండా ప్రభుత్వాలు సైతం శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీయూసీఐ రాష్ట్ర మహాసభలు నిజామాబాద్ జిల్లాలో జరపడం జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఆహ్వాన సంఘంలో మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు, బాధ్యులను చేర్చడం మంచి పరిణామమన్నారు. నేతలు ఎస్.ఎల్ పద్మ, ఎం.ముత్తెన్న, ముస్కె సుధాకర్, వి.ప్రభాకర్, వి.సంఘం, ఆల్గోట్ రవీందర్, పి.రామకృష్ణ, జి.శివరాజు, రాధాకిషన్, డి.రాజేశ్వర్, కే.గంగాధర్, బి.ఎస్.బి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ క్యాండిల్ లైట్ డే

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి(జీజీహెచ్) ఆవరణలో ఆదివారం క్యాండిల్ లైట్ డే నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ బారిన పడి చనిపోయిన బాధితుల స్మారకార్థం సందర్భంగా ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం క్యాండిల్ లైట్ డే నిర్వహిస్తారు. ఈ ఆదివారం స్థానిక ఆస్పత్రి ఆవరణలో కొవ్వొత్తులను వెలిగించి ర్యాలీని డాక్టర్లు అవంతి, భార్గవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆస్పత్రి నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ కొనసాగించారు. హెచ్ఐవీతో చనిపోయిన వ్యక్తుల ఆత్మకు శాంతి కలగాలని వారు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, సీఎస్‌వో నవీన్, టీబీ కో–ఆర్డినేటర్ రవి, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదుట క్యాండిళ్లతో నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితా సిద్ధం!



- తొలివిడతలో 4,400 దరఖాస్తులు
- అందులో నుంచి 762 దరఖాస్తులు ఫైనల్ చేసినట్లు సమాచారం

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా సిద్ధమైనట్లు తెలిసింది. సొంత ఇళ్లు లేని వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం కోసం నగరంలోని వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. గతంలో ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు దాదాపు 50 వేలకు పైగానే ఉన్నారు. ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ కులగణన సర్వేలో కొందరు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం సొంత స్థలం ఉండి ఇల్లులేని వారిని తొలి ప్రాధాన్యతగా గుర్తించింది. ఈ పథకంలో ముందుగా తమ పేరు మీద సొంత స్థలం ఉండి ప్రస్తుతం కిరాయి ఇంట్లో నివసిస్తున్న వారికి తొలి ప్రాధాన్యం కల్పించింది. దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో సర్వే చేసి రిపోర్టు తయారుచేశారు. అందులో నుంచి తొలి జాబితాలో 4,400 మందిని మాత్రమే గుర్తించారు. బల్దియా ప్రత్యేక అధికారులు రీసర్వే చేపట్టారు. దరఖాస్తులో తెలిపిన వివరాలను రూఢీ చేసుకున్నారు. జియో ట్యాగింగ్ చేసి వివరాలు 'ఇందిరమ్మ ఇండ్లు' యాప్‌లో నమోదు చేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ వివరాలను సేకరించి అందులో నుంచి 762 దరఖాస్తులను ఫైనల్ చేశారు. బల్దియా అధికారులు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	95,800	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	88,585		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
బీన్సుకాయ	150	200	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	25	50
పాలకూర	25	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	60	80
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	40	60

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 సింగిల్-1.30, 7.30 యమదొంగ-4.10, 10.30

స్క్రీన్-2 సింగిల్ 11.00,4.30,10.30

హిట్-1.30, 7.20

స్క్రీన్-3 మిషన్ ఇంపాజిబుల్-10.20,4.30, 7.30

మిషన్ ఇంపాజిబుల్(ఇంగ్లీష్ 2డీ)-1.30, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 మిషన్ ఇంపాజిబుల్-10.10, 4.25, 10.40 సింగిల్ -1.40, 7.55

స్క్రీన్-2 డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవెల్- 11.15, 10.50 - లవ్‌లీ-(3డీ)-2.05 సింగిల్-4.35

మిషన్ ఇంపాజిబుల్ -7.20

స్క్రీన్-3 లెవన్ -11.40

యమదొంగ-1.35 - శుభం- 8.05

ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(ఇంగ్లీష్)-10.45

స్క్రీన్ -4 ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ - 11.20, 1.50, 7.35 హిట్ -4.20, 10.05

లలితామహల్ యమదొంగ **దేవి** సింగిల్

నటరాజ్ మిషన్ ఇంపాజిబుల్

విజయ్ హిట్